# సమన్వయంతో పనిచేయాలి

- బందోబస్తు ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో సమీక్ష

## నియోజకవర్గంలో 50 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు • ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో ప్రత్యేక నిఘా

బంజారాహిల్స్,అక్టోబర్ 12 : శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసుశాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే కోరారు. ఎన్నికల ఏర్పాట్లతో పాటు బందోబస్తు తదితర అంశాలపై గురువారం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం పరిధిలో పనిచేయనున్న సెక్టరోయిల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ సభ్యులు, ఎస్‌ఎస్‌టీ బృందాలు, ఈఆర్‌వోలు, పోలీసుశాఖ తరపున ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని 245 పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు ఉండేలా ముందుగానే చర్యలు తీసుకోవాలని, దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్ల ఏర్పాటుతో పాటు లోనికి వెళ్లడానికి ర్యాంపుల నిర్మాణాన్ని ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తిచేయాలని రిటర్నింగ్ అధికారి వెంకటేష్ కోరారు. ఎన్నికల ప్రచారంతో పాటు ర్యాలీలకు సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా 48గంటల ముందుగానే పొందవచ్చున్నారు. నియోజకవర్గంలోని 245 పోలింగ్ స్టేషన్లలో 50క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించడం జరిగిందని, వాటిలో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. సెక్టోరియల్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల ప్రచారంతో పాటు ర్యాలీలపై వీడియో గ్రఫీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గం నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రశాంతి, అనితారెడ్డి, సంపత్, సాయి శ్రీనివాస్, బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య, వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు రవీంద్రప్రసాద్, సతీష్, రామకృష్ణ, దుర్గారావు, బాలగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, డెబోరా, రాజశేఖర్, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గం సెక్టోరియల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే

### ఆరు ఫ్లైయింగ్ బృందాలతో ప్రత్యేక నిఘా..

నియోజకవర్గంలో ఎన్నికలు సాఫీగా సాగేలా చూడడంతో పాటు అక్రమాలను నివారించేందుకు 6 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ఎన్నికల ప్రచారంతో పాటు ఇతర అంశాలపై ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల్లో పోటీచేసే ప్రతి అభ్యర్థి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుంది. స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్స్, అకౌంటింగ్ టీమ్స్, వీడియో సర్వెలెన్స్ టీమ్స్ నిరంతరం పనిచేస్తుంటాయి. నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్లకు సంబంధించిన ప్రాంతాలు 11 పోలీస్‌స్టేషన్లలో విస్తరించి ఉండడంతో ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు అప్రమత్తంగా ఉంటారు. వాహన తనిఖీల్లో పట్టుబడే డబ్బులు, బంగారం తదితర వస్తువులకు సంబంధించిన వివరాలను రిటర్నింగ్ అధికారితో పాటు ఏఆర్‌వోలకు తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యర్థి వ్యయంపై నిఘా వేయడం కోసం ఏఈవో నేతృత్వంలో ప్రత్యేక బృందాలు పర్యటిస్తుంటాయి.

# 16లోగా తుపాకులను డిపాజిట్ చేయాలి

## జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్



బంజారాహిల్స్,అక్టోబర్ 12: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పీఎస్ పరిధిలోని లైసెన్స్‌డ్ తుపాకులను వెంటనే డిపాజిట్ చేయాలని జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ సూచించారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో 405 లైసెన్స్‌డ్ తుపాకీలు ఉన్నాయని, వాటిలో 61 తుపాకీలు డిపాజిట్ చేశారని తెలిపారు. ఫిలింనగర్ పీఎస్ పరిధిలో 62 తుపాకులు ఉండగా 22మాత్రమే డిపాజిట్ అయ్యాయన్నారు. అక్టోబర్ 16లోగా అన్ని ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో గాని,ఆర్మరీ డిపోలో డిపాజిట్ చేసి రశీదులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. అక్టోబర్ 16లోగా ఆయుధాలు డిపాజిట్ చేయకపోతే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా పెట్టే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

# నోటు పుస్తకాలు పంపిణీ

అంబర్‌పేట, అక్టోబర్ 12: బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. విజయం స్వచ్ఛంద సేవా సంస్థ ట్రస్ట్ ద్వారా విద్యార్థులందరికీ నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విజయం స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సీహెచ్ చంద్రమోహన్, కెంచె మహేశ్, మిర్యాల శ్రీను, గోవిందు అర్జున్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజు

ఖైరతాబాద్, అక్టోబర్ 12 : కారణం లేని మరణం ఒక్క రోడ్డు ప్రమాదంతోనే జరుగుతుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్ రాజు అన్నారు. బేగంపేట ట్రాఫిక ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమాజిగూడలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బందికి ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శంకర్ రాజు ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదరహిత సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ మెడికల్ సూపరిండెండెంట్ డాక్టర్ చిరంజీవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రషద్, హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఈ. చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి’

కాచిగూడ,అక్టోబర్ 12: దేశంలో 70 కోట్ల మంది ఉన్న బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించే అంశాన్ని బీజేపీ, కాంగ్రెస్, తదితర పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కులగణన చేట్టి, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు.

# సాఫ్ట్‌వేర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

## లక్షల్లో ఆస్తి నష్టం



క్యాడ్‌సిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో కాలిపోయిన ఫర్నిచర్ సామగ్రి

హిమాయత్‌నగర్,అక్టోబర్12: విద్యుదాఘాతంతో ఓ సాఫ్ట్‌వేర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించింది.ఈ ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సీఐ చంద్రశేఖర్,సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్ నగర్ తిరుమల ఎస్టేట్ లోని రెండో అంతస్తులో ఉన్న క్యాడ్‌సిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయానికి గురువారం ఉదయం 6గంటలకే ఉద్యోగులు చేరుకుని పనిచేస్తున్నారు.ఈ క్రమంలో కంప్యూటర్స్ వాటికి సంబంధించిన సీపీయూలో ఉదయం 9:40 నిమిషాలకు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కార్యాలయంలో దట్టమైన పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి.ఉద్యోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటా హుటిన ఎస్సైలు నరేష్ కుమార్,శిరీష ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. రెండు ఫైర్ ఇంజిన్లతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ ప్రమాదంలో విలువైన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు,ఫర్నిచర్ తదితర వస్తువులు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


